# నా జ్ఞాపకములు

శ్రీ వేలూరి
= శివరామశాస్త్రి =



ఒక గొల్లగూడెము. దానికిఁ బరుగు మేరలో నొక పంటచెఱువు. దానిక్రింద నొక చిన్న యారామము. దానిచుట్టును చొఱరాని యావరణము. దానిలో నొక పెద్ద మఱ్ఱి. దానిక్రింద నొక బైరాగి. స్థావరమగు మఱ్ఱిక్రింద జంగమ మగు మఱ్ఱి.

స్థావరమగు మఱ్ఱి పిలువని పేరంటము; జంగమ మగు మఱ్ఱి?

ఆ దారిని రాకపోకలు చేయుచు పలుమారులు నే నా నడమఱ్ఱిని జూచుచుంటిని. అదియు నన్నుఁ జూచుచుండెను.

ఒకనాఁ డా మఱ్ఱిక్రింద బైరాగుల మేళనము; మఱియొక నాఁడు స్త్రీ సభ; ఇంకొక నాఁడు సార్వజనిక సమ్మేళనము. వృక్షాగ్రమున పక్షుల అవ్యక్త ధ్వని; చెట్టుక్రింద సాధువుల అవ్యక్త ధ్వని.

నాకు లోనికి వెళ్లవలయు నని కుతూహలము కలిగెను. వెళ్లుట కుపాయము? వెళ్లి? ... ఇటులు కౌతుక సందేహములు కాలమును గడపెను.

ఆ నడమఱ్ఱి కూరగాయ లమ్మనని తెలిసెను. ఇంకేమి? రాచబాట దొరికెను.

ఒక రూపాయ చూపి లోని కేగితిని. పలువురు సాధువుల నడుమఁ గూర్చుండి ఆ బైరాగి గంజాయి పీల్చుట కాయత్తుఁ డగుచుండెను. నేనీ లోపుగా వటప్రదక్షిణమున కాయత్తుఁడ నయితిని. ప్రదక్షిణము చేయుటకు వటముచుట్టును వలయాకారముగా ఊడలతో గోడ యేర్పాటు చేయఁబడెను. దీనికి మూఁడు గజముల యెడమున మఱొకటి. ఇది స్త్రీలకు. ఈమార్గమున గోడగా నేర్పడిన ప్రతియూడక్రింద నొక్కొక్క పుట్ట కలదు. ప్రతి పుట్టయు ఫలపుష్పములతోడను, కుంకుమచందనములతోడను పూజాపురస్కారము లందుకొనుచుండెను. ఈ రెండు మార్గములును వటమూలమునకుఁ గొంపోవును. అచట ఊడలమీఁద మట్టి మేగి యేర్పఱచిన గోడలమీఁద సజీవములైన యూడలనే పైకప్పుగా నమర్చి డాబా చేసి దానిమీఁద మఱొక గది కట్టి దానిని ద్విభూమమగు ప్రాసాదముగా చేసిన ఆ బైరాగి శిల్పము మన కబ్బురము కలిగించును. క్రిందిది సమాధి గృహము, పయిది నిద్రాగృహము.

ఆ యారామము సుమా రొక యెకరము మేర ఆక్రమించియుండవచ్చును. కాని పదియెకరములలో నుండఁదగిన చెట్లుండుటఁజేసి వానిక్రింద వాని నీడకుఁగూడ తావులేదు.

నేను వటప్రదక్షిణము చేసి సాధుబృందముకడకు వచ్చి కూరుచుంటిని. కలుగఁబోవు చిత్తైకాగ్రతకు సూచకమగు జెండావలె గంజాయిపొగ అంబరవీథిలో మీఁదిమీఁది కెగసి పీడకలవలె నంతరించెను. జన్మాంతరవాసనవలె దాని వాసన నన్నుఁ బట్టుకొని వదలలేదు. కొంతసేపటికి అచటి స్థలాకాశములు రెండును నిర్మలము లాయెను. సాధువుల ముఖముద్ర నిద్రాభిముఖమగుడు ఆ బైరాగి 'భం మహాదేవ' అని ఒక అఱపఱచెను. సాధువు లందఱు నతని ననుకరించిరి. చెట్టుమీఁది పిట్ట లన్నియు తుపాకిదెబ్బ కెగిరిపోయినటు లెగిరిపోయెను. ఆ మర్రిగూడ ఆకులచే నంబరకేశు నాహ్వానించెను. పిదప నతఁడు "మర్రిలో తొర్ర, తొర్రలో పర్ర, పర్రే పంచభూతాల జీవగర్ర, అంతా సింగినాదం జీలకర్ర" అని ఉపన్యసించెను. సాధువు లందఱును అత్యానందమును వెలిబుచ్చిరి.

అక్కడ నున్న చాకిసాధు వొకఁడు "పర్రే పంచభూతాల జీవగర్ర యేమిటి?" అని ప్రశ్నించెను.

ఈతఁడు క్రోసు మేర నున్న ఒక యూరి నుండి దైనందినమును జిజ్ఞాసువై అక్కడికి వచ్చుచుండును. ప్రశ్నించుటయే అతని పని. ఈ ప్రశ్న పడఁగనే బైరాగి "పర్రే జీవగర్ర. సార బుర్ర. పెద్ద సెర్ర. ఓరి కుర్ర" అని ప్రత్యుత్తరించెను.

సాధువు లందఱు పకపక నవ్విరి. చాకికి మాత్రము సంశయము తీరలేదు. దాన నతఁడు నాకేసి తిరిగి "అయ్యా, తమరు తెలిసినవారు, మర్రే జీవగర్ర గాని పర్ర జీవగర్రా?" అని అడిగెను. నేను నా యజ్ఞానము నివేదించితిని. అంత బైరాగికి కోప మెత్తుకొని వచ్చెను. "ఇదిగో పర్రే జీవగర్ర. చాకలోడికి నాపిర్ర" అని యభినయించెను. సాధువు లందఱును చాకిసాధువును పరిహసించిరి.

ఈరీతిగా నాఁటి తత్త్వసభ ముగిసెను. బైరాగి అందఱుతలలపై నక్షతలుచల్లి తనపైఁగూడఁ జల్లుకొనెను. వెంటనే యతఁ డొక కలుగు ప్రక్కఁ గూర్చుండి ముక్కుమూసికొని ఒకానొక శబ్దము చేసెను. కొన్ని యెలుక లా కలుగునుండి వెలువడి అతని జటాజూటము మీఁది కెక్కి అక్షతలను దినిపోయెను. ఈవినోదమును జూచి నేను నా కుటీరమునకు మరలితిని.

నాఁటిరేయి తీరికగా కూర్చుండి యీబైరాగి భావ కర్థ మాలోచింపఁదొడఁగితిని. చట్టున అథర్వణములోని—

"కస్మి న్నఙ్గే తిష్ఠతి భూమి రస్య
కస్మి న్నఙ్గే తిష్ఠతి అంతరిక్షమ్,
కస్మి న్నఙ్గే తిష్ఠతి ఆహితో ద్యౌః
కస్మి న్నఙ్గే తిష్ఠతి ఉత్తరం దివః"

అను సూక్తము స్మృతికిఁ దవిలెను. అంతట మర్రి యనఁగా దైవ మనియు, తొర్ర యనఁగా అవ్యక్తమనియు అర్థము చెప్పుకొని సరిపెట్టుకొంటిని. కాని మరల నాబైరాగికడకు వెళ్లినపు డాతనితో జరిగిన సంభాషణలకు ఫలముగా అతని మాటలలోఁ గాని, బోధలలోఁగాని లోఁతులకు దిగవలసిన పని యుండదని తెలిసికొంటిని. ఆతఁడు తత్త్వప్రసంగములు చేయునపుడెల్ల అనర్థకములగు రూపకాతిశయోక్తులలో అంత్యప్రాసములు కల శబ్దముల నతికి దిగ్భ్రాంతి కలిగించుచు వాక్సముద్రము నుబికించుచుండును. చాకిసాధువు దర్భశయనము చేసి ప్రశ్నబాణములఁ బరఁగించుచుండును.

ఇటుపిమ్మట నాకును, బైరాగికిని తత్త్వచింతలోఁగాక కూరగాయలచింతలో సంబంధము కలిసెను. ఖాతాకూడ నేర్పడెను. బైరాగికి గంజాయికావలెను; నాకు కూరగాయలు కావలెను. గంజాయి కావలసినపుడెల్ల ఆబైరాగి నా కక్కఱలేకున్నను సుమారిరువది సపోటాలు పంపి రూపాయ వసూలుచేయ మొదలిడెను. ఇది నా కిబ్బందిగా నుండెను. '౩౪-వ సంవత్సరమున తుపానుకు అతని అరఁటితోఁట యంతయుఁ దాటాదూటమాయెను. విఱిగిన లేయనఁటి పిండెలగెల యొకటి శిష్యునిచేఁ బంపి రూపాయ ఆఱణాలకు హుండి పంపించెను. నే నా పనికిమాలిన గెలను దూరముగా నుంచి నా కొరనివస్తు. వేదియు నిఁకఁ బంపవలదని మీఁగురువుతోఁ జెప్పుమని అతని నంపితిని. పదినాళ్లు దాఁటినపిదప ఆబైరాగి నిండువేసముతో నాకుటీరమధ్యమునకు వచ్చి కూర్చుండి ప్రాణాయామ మొనర్చి వెంటనే ధ్యాననిద్రనుండి లేచి కను లెర్రఁజేసికొని 'రూపాయ ఆఱణాలు' అని గర్జించెను. నేను

శాంతిమార్గ మవలంబించితినిగాని లాభము లేకపోయెను. తుదకు శాత్యదండము చేకొంటిని. నన్నతఁడు బిగ్గఱగా శపించి ఆ శాపాక్షరముల అక్షరాల నడపుటకు సూర్యు నామంత్రించి ఆకసము చూచుచుఁ బాఱిపోయెను.

సూర్యుఁ డతని శాప మమలుపఱుపకపోవుటచేఁ గాఁబోలు నాతఁడే కొన్నాళ్లకు స్వయముగా వచ్చెను. నే నపుడు కొండనెత్తమునుండి దిగుచుంటిని. అంధకార మపుడే అతనికిఁ దోడుపడెను. కాని బైరాగి నాకంటఁ బడెను. అతఁడు కంచె కొల్దరినుండి నా కుటీరమును తొంగితొంగి చూచుచుండెను. నేను గబగబ పైనుండి దిగితిని.

అతఁడు చేతికి దొరికిన రాలు పుచ్చుకొని కుటీరముమీఁదికి విసిరి ప్రత్యుత్తరమున కపేక్షించుచుండెను. ఇంతలో ననపేక్షితముగా నే నతని వెనువెనుకనే యుండి కొన్ని చిన్నగులకరా లతనిమీఁద విసరితిని. అతఁడు వెనుదిరిగి చూచి వెఱగుపడి పాఱిపోయెను. నేను వెంటాడితినిగాని అతనిని పట్టుకొనలేకపోతిని. ఆ మఱునాఁ డాతఁడు చాకిసాధువు నా పాకమీఁద రాలు రువ్వెనని ప్రచారముచేసెను. ఆచాకిసాధు వా యకార్యము తానే చేసినటుల పెద్దలముం దొప్పుకొనెనఁట.

అటుపిమ్మటఁ గొన్ని యేండ్లవఱకును మా యిరువురకు సమావేశము కలుగలేదు. నే నొకనాఁ డొకరాదారిని బోవుచుంటిని. ఆ రాదారిప్రక్క పెంటపాడు బైరాగులమఠము కలదు. హఠాత్తుగా అచట నాబైరాగి!

అతఁ డామఠములోనుండి వచ్చుచుండెను. ఆతనికొఱ కొకఁడు బయటఁ బొంచుండెను. బైరాగి కాలు గడప కీవలఁ బడెను. పొంచున్న యతఁ డతనిగడ్డము పట్టి అటునిటు నిటునటు జాడింపఁదొడఁగెను. బైరాగి 'చస్తి, చస్తి'నని యార్చెను. గబాలున నే నాయిరువుర నడుమ కుఱికితిని. అతనిగడ్డములో గుప్పెఁడు వెంట్రుకలూడినపిదపఁగాని నే నతనికి ముక్తి కలిగింపలేకపోతిని.

అతఁ డామఠములో గంజాయి దొంగిలెను. దానికి శాస్తిగా ముఖమునందలి కంబళినుండి కొన్ని వెంట్రుకలేకాక గడ్డమునందలి కొంత రక్తమునుగూడ నతఁ డీయవలసివచ్చెను.

అతఁడు నన్నుఁ జాటుచేసికొని వెనుదిరిగి చూచుచు ఒక క్రోసుమేర వచ్చెను. అక్కడ గ్రామసీమ. మేమిరువుర మొండొండ మాటాడకుండ మా మాదారులఁ బోయితిమి. అతఁ డీ దొంగతనమునుగూడ చాకిశిష్యునిపై మోపెను. అతఁ డొప్పుకొనెను. గురువు నపగాథము లన్నిఁటిని నిశ్చలముగా మోయు నీచాకివాఁ డెదురుపడినపుడెల్ల నా మేను పులకరించిపోయెడిది.

కొన్నాళ్లకు పలువురు లక్ష్మీపుత్రులా బైరాగికి శిష్యులయిరి. దాన నతఁడు గంజాయి దొంగిలుట మానివేసెను. ఆశిష్యు లొక్కొక్క రొక్కొక్కరోఁ డొక్కనాఁడు ఆమఱ్ఱిక్రింద అష్టాదశ వర్ణములవారికిని సంతర్పణ మొనర్పఁబూనిరి. అందులకుఁ దెచ్చిన సంభారములలోఁ గొన్ని మాయమాయెను. ఉన్నాఁడుకదా పాపాలకల్ల భైరవుఁడు! బైరాగి చాకివానిమీఁద నా దొంగతనము మోపుటయు, నతఁ డొప్పుకొనుటయు, దానికి ఫలముగా శాస్తి యనుభవించుటయు జరిగిపోయెను.

కొలఁదినాళ్లలోనే ఆ చాకిసాధువు శరీరము చాలించెను. పుచ్చుకుక్క నీడ్చి పాఱవేసినటు లాతని శరీరము నా మఱ్ఱిక్రిందినుండి యీడ్చి పాఱవైచిరి.

అటుపిమ్మట నయిదాఱేండ్లకు నే నా బైరాగి తోఁటప్రక్కనుండి పోవుట తటస్థించెను. అచట నా కా చాకిసాధువు గుఱుతు దవిలెను. అతఁ డచట ధ్యానము చేసికొను నేలబొరియ చూడఁగోరిక కలిగెను (ఇది పవాహారిబాబా గంగయొరఁ ద్రవ్వుకొనిన బొరియవంటిది). అంత టలోని కరిగితిని.

బైరాగి కంకాపాంకములుగా జ్వరము కాయుచున్నదని తెలియవచ్చెను. నే నతని శయ్యకడ కరిగితిని. అతఁడు సంధిలో నుండెను. నే నపు డతనికి నారాయణు నందించితిని. అతఁడు 'గంజాయి గంజాయి' అని యనెను. నే నచటినుండి చాకిసాధువు నేలబొరియకడ కరిగితిని. దాని నెవరో పూడ్చివైచిరి.

మఱి పదిరోజుల కాబైరాగి మరణించెను. శిష్యు లెందఱో చేరి యాశవము నలంకరించి పెండ్లికొడుకు నూరేగించినట్లూరేగించిరి. పిమ్మట నచట నొకసమాధి కట్టించిరి.